
పోచారం గ్రామ ముఖ చిత్రం

పల్లెల్లో వేడెక్కిన రాజకీయం



పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో రాజకీయం వేడెక్కింది. మొదటి విడత నామినేషన్‌ల పర్వం ముగియడం, రెండో విడత నామినేషన్‌లు ఆదివారం నుంచి ప్రారంభం అయ్యాయి. దీంతో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. నువ్వా.. నేనా అన్నట్లు పోటాపోటీగా మొదటి విడత గ్రామాల్లో అభ్యర్థులు నామినేషన్‌లు వేశారు. నామినేషన్ల పర్వం ముగియడంతో పోటీలో ఉండే అభ్యర్థులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం విందు, వినోదాలకు తెర లేపారు. కొందరు కుల సంఘాల మద్దతు కూడగట్టె ప్రలోభాల్లో ఉన్నారు. మరో వైపు పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు సమ్మాయత్తం అయ్యాయి. ప్రజల్లో మంచి పేరుతో ఆర్థిక బలం ఉన్నవారిని పోటీలో నిలపాలని నేతలు,వ్యూహాలు పన్నుతున్నారు. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు ఆశావహులు, కార్యకర్తలతో విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. పనిలో పనిగా చేరికలను ప్రోత్సహిస్తున్నారు.

- పంచాయతీ ఎన్నికలపై పార్టీల నజర్
- అధిక స్థానాలు దక్కించుకునేలా వ్యూహం
- కార్యకర్తలతో జోరుగా సమావేశాలు
- పోటాపోటీగా చేరికలు
- ఇప్పటికే ముగిసిన మొదటి విడత నామినేషన్‌లు
- మొదటి విడతలో సర్పంచ్ స్థానాలకు 1,224, వార్డు స్థానాలకు 3,832 నామినేషన్‌లు
- 5 గ్రామాల్లో దాఖలైన ఒకే ఒక నామినేషన్


కామారెడ్డి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడతలో కామారెడ్డి డివిజన్ పరిధిలోని పది మండలాల్లో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే నామినేషన్ల పర్వం ముగిసింది. శనివారం అర్ధరాత్రి వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. మొదటి విడతలో భారీగా నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. 167 సర్పంచ్ స్థానాలకు గాను తొలి రెండు రోజుల్లో అంతంత మాత్రంగానే నామినేషన్‌లు రాగా చివరి రోజు భారీగా నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. కేవలం మూడో రోజు మాత్రమే 856 సర్పంచ్ స్థానాలకు నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. ఇలా 167 సర్పంచ్ స్థానాలకు 1,224 నామినేషన్‌లు వచ్చాయి. అదేవిధంగా 1,520 వార్డు స్థానాలకు మూడోరోజు 3,137 నామినేషన్‌లు రాగా మొత్తం 3,832 దాఖలు అయ్యాయి. ఇదిలా ఉండగా ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో సింగిల్ నామినేషన్‌లు మాత్రమే వచ్చాయి. బీబీపేట మండలంలోని శివారు రాంరెడ్డిపల్లి, మాచారెడ్డి మండలంలోని అంకిరెడ్డిపల్లితండా, వెనుకతండా, పల్వంచలోని భవానిపేట తండా, సదాశివనగర్ తుక్కోజీవాడిలో ఒక్కో నామినేషన్ దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

జోరుగా చేరికలు

స్థానిక ఎన్నికల వేళ ప్రధాన పార్టీల్లో చేరికలు ఊపందుకున్నాయి. ప్రధానంగా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు ఇతర పార్టీలకు చెందిన వారిని కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జుక్కల్ నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన ప్రతిపక్షాలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో చేరారు. అదేవిధంగా అధికార కాంగ్రెస్‌లో టికెట్లు రాక అసంతృప్తితో ఉన్న వారిని బీఆర్ఎస్ గాలం వేస్తోంది. పిట్లం మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి సర్పంచ్‌గా పోటీ చేసేందుకు స్థానిక నేత మద్దతు ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్‌లో చేరారు. అదేవిధంగా ఎల్లారెడ్డి, కామారెడ్డిలోనూ అధికార, బీఆర్ఎస్‌లో జోరుగా చేరికలు కొనసాగుతున్నాయి. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ మరింత బలపడేందుకు సర్పంచ్ ఎన్నికలను ఆ పార్టీ ముఖ్యనేతలు ఫోకస్ పెట్టి ప్రతిపక్షాలకు చెందిన గ్రామస్థాయి కార్యకర్తలను, నాయకులను పార్టీలో చేర్చుకునే పనిలో పడ్డారు.

మొదటి విడతలో దాఖలైన నామినేషన్లు ఇలా..

మండలం	సర్పంచ్ స్థానాలు	వచ్చిన నామినేషన్లు	వార్డు స్థానాలు	నామినేషన్లు
భిక్కనూరు	18	134	182	544
బీబీపేట్	11	70	110	276
దోమకొండ	09	74	96	286
కామారెడ్డి	14	121	120	356
మాచారెడ్డి	25	211	196	435
పాల్వంచ	12	97	110	312
రాజంపేట్	18	132	158	368
రామారెడ్డి	18	135	166	440
సదాశివనగర్	24	139	214	467
తాడ్వాయి	18	111	168	348
మొత్తం	167	1224	1520	3832



ప్రధాన పార్టీల ఫోకస్

పంచాయతీ ఎన్నికలపై (మిగతా 8లో..)

సింగిల్ వచ్చిన నామినేషన్‌లు

మండలం	గ్రామ పంచాయతీ	వచ్చిన నామినేషన్‌లు
బీబీపేట	శివారురాంరెడ్డిపల్లి	1
మాచారెడ్డి	అంకిరెడ్డిపల్లితండా	1
మాచారెడ్డి	వెనుకతండా	1
పల్వంచ	భవానిపేటతండా	1
సదాశివనగర్	తుక్కోజీవాడి	1

ఆ గ్రామంలో.. 40 ఏళ్లుగా ఏకగ్రీవమే

బాన్సువాడ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని పోచారం గ్రామంలో గత 40 ఏళ్లుగా సర్పంచ్‌ను ఏకగ్రీవంగానే ఎన్నుకుంటున్నారు. రిజర్వేషన్ ఏ సామాజిక వర్గానికి వచ్చినా ఆ వర్గం నుంచి మంచి నాయకుడిని సర్పంచ్‌గా ఎన్నుకోవడం జరుగుతోంది. 1980లో పోచారం గ్రామం పంచాయతీగా ఏర్పడింది. నాటి నుంచి నేటి వరకు అటు సర్పంచ్ స్థానానికి గాను, ఇటు వార్డు మెంబర్ స్థానానికి గాను గ్రామస్థులు సమావేశమై అందరి అంగీకారంతో పనిచేసే నాయకులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ వస్తున్నారు. ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్వగ్రామం కూడా ఇదే. 40 ఏళ్లుగా ఏకగ్రీవంగా సర్పంచ్‌ను ఎన్నుకుంటున్న పోచారం గ్రామం యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది.


కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్‌కు బై.. కాంగ్రెస్‌కు జై

- కాంగ్రెస్‌కు క్యూ కడుతున్న బీఆర్ఎస్ నాయకులు

భిక్కనూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగులుతోంది. గత రెండు, మూడు రోజులుగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌కు క్యూ కడుతున్నారు. ఇప్పటికే పెద్దమల్లారెడ్డి విండో చైర్మన్, సీనియర్ నాయకుడు రాజాగౌడ్, సీనియర్ నాయకులు సతీష్‌గౌడ్‌తో పాటుగా 30 మంది వరకు కాంగ్రెస్‌లో చేరగా ఆదివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పొట్టిగిని శంకర్, సీనియర్ నాయకులు డప్పు రవి, ఎన్ఆర్ఐ జ్ఞానప్రకాష్ రెడ్డితో పాటుగా పలువురు షబ్బీర్‌అలీ సమక్షంలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి షబ్బీర్‌అలీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ సీట్లు గెలుచుకుంటుందని, ప్రజలు కాంగ్రెస్‌తోనే ఉన్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత నామినేషన్లు షురూ

- మొదటి రోజు భారీగా నామినేషన్‌లు
- 197 సర్పంచ్ స్థానాలకు 81 నామినేషన్‌లు
- 1,654 వార్డులకు 74 నామినేషన్ల దాఖలు

కామారెడ్డి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత నామినేషన్‌ల ప్రక్రియ శనివారం ముగియగా స్క్రూటినీ సైతం నిర్వహించారు. ఆదివారం రెండో విడత నామినేషన్‌ల ప్రక్రియ మొదలైంది. జిల్లాలోని ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని 7 మండలాల్లో 197 సర్పంచ్, 1,654 వార్డు స్థానాలకు గాను నామినేషన్ల ప్రక్రియ చేపట్టారు. ఇప్పటికే నిర్ధేశించిన క్లస్టర్‌ల పరిధిలో 57 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే వారి నుంచి సంబంధిత ఎన్నికల అధికారులు నామినేషన్‌లు స్వీకరించారు.



సర్పంచ్‌కు 81, వార్డులకు 74 నామినేషన్‌లు

ఎల్లారెడ్డి డివిజన్‌లోని లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి, ఎల్లారెడ్డి, మహ్మద్‌నగర్, నిజాంసాగర్, పిట్లం మండలాల్లోని సర్పంచ్ వార్డు స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. మొదటి రోజు 197 సర్పంచ్ స్థానాలకు 81 నామినేషన్‌లు దాఖాలు అయ్యాయి. అదేవిధంగా 1,654 వార్డు స్థానాలకు గాను 74 నామినే షన్‌లు వచ్చాయి. లింగంపేట మండలంలో 41 సర్పంచ్ స్థానాలకు గాను 8 నామినేషన్‌లు దాఖాలు కాగా 342 వార్డులకు గాను 5 నామినేషన్‌లు వచ్చాయి. నాగిరెడ్డిపేట 27 సర్పంచ్ స్థానాలకు 14, 232 వార్డు స్థానాలకు 14 నామినేషన్‌లు రాగా, గాంధారి 45 సర్పంచ్ స్థానాలకు గాను 19, 366 వార్డులకు 23, నామినేషన్‌లు రాగా, ఎల్లారెడ్డి 31 సర్పంచ్ స్థానాలకు 12, 246 వార్డు స్థానాలకు 9, మహ్మద్‌నగర్ 13 సర్పంచ్ స్థానాలకు 14, 112 వార్డులకు 11, నిజాంసాగర్ సర్పంచ్ స్థానాలకు 4, 122 వార్డులకు 6, పిట్లం 26 సర్పంచ్ స్థానాలకు 10, 234 వార్డులకు 6 నామినేషన్‌లు వచ్చాయి.


బంజపల్లిలో నామినేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

అభ్యర్థితో పాటుగా ఇద్దరు మద్దతుదారులకు మాత్రమే అనుమతి

నిజాంసాగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ కేంద్రాల్లో అభ్యర్థితో పాటుగా ఇద్దరు మద్దతుదారులకు మాత్రమే అనుమతిస్తామని బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల్లోని నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలంచారు. కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాలకు ర్యాలీగా వెళ్లే వారు ముందుగా అనుమతి తీసుకోవాలని, నామినేషన్ కేంద్రంలోనికి అభ్యర్థితో పాటుగా ఇద్దరు మద్దతుదారులకు మాత్రమే అనుమతి ఉంటుందని ఇతరులు వెళ్లినట్లయితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ తిరుపయ్య, ఎస్సై శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపికైన పెద్దఎక్లారా బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు

స్టేట్ లెవెల్ కబడ్డీ పోటీలకు గురుకుల బాలికలు

మద్నూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెద్ద ఎక్లారా, మద్నూర్ గురుకుల పాఠశాలల నుంచి ఐదుగురు బాలికలు స్టేట్ లెవెల్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ స్వప్న, సత్యశీల తెలిపారు. ఇటీవల కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన కబడ్డీ పోటీల్లో పెద్దఎక్లారా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు సంధ్యారాణి, నిఖిల, అంజలి, సృజన, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మౌనిక తెలిపారు. అదేవిధంగా మద్నూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ఐశ్వర్య స్టేట్ లెవెల్ కబడ్డీ పోటీకి ఎంపికైనట్లు పీఈటీ నవనీత వెల్లడించారు. డిసెంబరు ఒకటి నుంచి 5వ తేదీ వరకు నల్గొండలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి బాలికలు వెళ్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ సిబ్బంది అభినందించారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్‌రెడ్డి

ప్రజలకు సేవలందించాలి

- ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సర్వీసు కాలంలో మచ్చ లేకుండా ప్రజలకు సేవలందించాలని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీనివాస గార్డెన్స్‌లో నిర్వహించిన వెటర్నరీ అధికారి దేవారం శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఉద్యోగ విరమణ చేస్తున్న దేవారం శ్రీనివాస్‌రెడ్డిని పోచారం దంపతులు ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలందించేవారు నిస్వార్థంగా సేవ చేసినపుడు గౌరవం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్, పోచారం శంభురెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డి, నాయకులు, ఉద్యోగులు తదితరులున్నారు.

గురుకుల పాఠశాలలో టెండర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో శుభ్రత, పారిశుధ్య సేవల కోసం కాంట్రాక్టర్లు, ఏజేన్సీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల భవనాలు, తరగతి గదులు, ప్రయోగశాలలు, మరుగుదొడ్లు, కారిడార్ పరిసరాలను ప్రతి రోజూ శుభ్రత, పారిశుధ్యం కోసం ఆసక్తి గలవారు డిసెంబర్ 1, 2న షీల్డ్ టెండర్లను సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9704550260ను సంప్రదించాలన్నారు.

జిల్లాలో 30, 30(ఎ) యాక్ట్ అమలు


- ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డి టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసుయాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ రాజేష్ చంద్ర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్‌మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ప్రజా ధనాన్ని నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని తెలిపారు.

అవగాహన లేకుంటే అనర్థమే

- జిల్లాలో తగ్గుముఖం పట్టిన హెచ్ఐవీ కేసులు
- హెచ్ఐవీ తగ్గుముఖంలో రాష్ట్రంలోనే జిల్లాకు రెండో స్థానం
- అవగాహన కార్యక్రమాలతో పూర్తిస్థాయిలో నివారణకు చర్యలు చేపడుతున్న అధికారులు
- జిల్లాలో 31,704 మందికి పరీక్షలు చేయగా 184 మందికి హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ
- 19 సంవత్సరాల నుంచి హెచ్ఐవీ కేసులు 5.25 శాతం నుంచి 0.41 శాతంకు తగ్గుముఖం
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

కామారెడ్డి టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ (హ్యూమన్ ఇమ్యూనో వైరస్) పాజిటివ్. ఈ పేరు చెబితేనే గతంలో ప్రజలు హడలిపోయేవారు. హెచ్ఐవీ కలవారు గతంలో నలుగురితో కలవాలన్నా భయపడేవారు ఎందుకంటే హెచ్ఐవీ సోకిన వ్యక్తిని సామాజికంగా బహిష్కరించినట్లుగానే ఇతరులు చూసేవారు. హెచ్ఐవీని నియంత్రించడం కాకుండా శాశ్వత నిర్మూలనే లక్ష్యం కావాలని, శరీరంలోని ఏ నాడి వ్యవస్థలపై దీని ప్రభావం అధికంగా ఉంటుందని, హెచ్ఐవీ సోకినప్పుడు ఎలాంటి



జాగ్రత్తలు తీసుకోవాలి, ఏ మందులు వాడాలనేది క్రమక్రమంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవగాహన చర్యలతో అందరికి తెలిసింది. దీంతో గతంలో కంటే మరణాల సంఖ్య ప్రస్తుతం తగ్గుముఖం పట్టింది. విస్తృతస్థాయిలో అవగాహన పెరగడంతో జిల్లాలోని కామారెడ్డి జీజీహెచ్ ఆసుపత్రి,బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఏఆర్‌టి సెంటర్‌లలో స్వచ్ఛందంగా వచ్చి రోగులు వ్యాధి తీవ్రతను తగ్గించుకునేందుకు మందులు వాడుతున్నారు. హెచ్ఐవీ సోకిన గర్భిణుల నుంచి పుట్టె బిడ్డకు సోకకుండా కాపాడే ప్రయత్నాలు వైద్య బృందం చేస్తోంది. అయితే ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు, స్వచ్ఛంద సంస్థల చైతన్య కార్యక్రమాల వల్ల జిల్లా వ్యాప్తంగా హెచ్ఐవీ రోగుల్లో అవగాహన పెరుగుతున్నప్పటికీ అవగాహన రాహిత్యంతోనో, నిర్లక్ష్యంతోనే కొందరు ఇష్టారీతిన వ్యవహరిస్తే అనర్థం దరి చేరుతుందనే వైద్యబృందం పేర్కొంటుంది. రాష్ట్రంలోనే ఎయిడ్స్ నివారణలో హైదరాబాద్ మొదటి స్థానంలో నిలువగా.. జిల్లా రెండో స్థానంలో ఉంది. ప్రాణాంతక వ్యాధిపై అవగాహన కల్పిస్తు వ్యాధి ఎలా వ్యాపిస్తోంది అనే దానిపై ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

హెచ్ఐవీ వ్యాప్తి.. లక్షణాలు

సాధారణంగా అనైతిక లైంగిక సంపర్కం, రక్తం ఎక్కించినప్పుడు, లాలాజలం, జననాంగ స్రావాల వంటి వాటితో హెచ్ఐవీ వ్యాపిస్తోంది. హెచ్ఐవీ అంటువ్యాధి కాదు. అది వైరస్ వల్ల వ్యాపించేవ్యాధి. వైరస్ సోకిన వ్యక్తి రక్తంను మరొకరికి ఎక్కించిన, హెచ్ఐవీ సోకిన తల్లి మందులు వాడకుండా బిడ్డకు చనుపాలు ఇచ్చినా బిడ్డకు సైతం సోకుతుంది. హెచ్ఐవీ సోకిన (మిగతా 8లో..)

సర్పంచ్‌కు మేడమ్ పంచ్..!

- భార్యలను బరిలో దింపేందుకు సన్నద్ధం
- జోరందుకున్న ఎన్నికల హడావిడి
- సెంటిమెంట్ కలిసి వస్తోందని ఆలోచన

7

పవర్ కోసం పాకులాట..!

- ఉప సర్పంచ్ పదవికి డిమాండ్
- చెక్ పవర్ కోసం ఆరాటం
- సర్పంచ్ రిజర్వేషన్ కలిసి రాని వారి ఆసక్తి
- పెరుగుతున్న పోటీదారులు

6



శివాలయంలో శుభ్రం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

శివాలయంలో స్వచ్ఛ భారత్

ఆర్మూర్ , నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజారాంనగర్ శ్రీ శివపంచాయతన ఆలయ ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం, ముళ్ల పొదలను తొలగించారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని నీటితో శుభ్రం చేశారు. కాలనీవాసులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, ఆనంద్, అర్చకుడు కిశోర్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిషాంత్, ప్రశాంత్, రాజ్‌కుమార్, గణేష్, నరేందర్, ఎల్లయ్య, ఆదిత్య తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మోసం



సమావేశంలో మాట్లాడుతున్న వి. ప్రభాకర్

భీమ్‌గల్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న సొసైటీ, ఐకేపీ అధికారులు రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై క్వింటాలుకు 5 కిలోల తరుగు తీస్తూ రైతులను ముంచుతున్నారని అఖిల భారత ఐక్య రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. మండలంలోని తాళ్లపల్లి, గంగరాయి, కొత్తపల్లి, రాహత్‌నగర్, దేవక్కపేట్, కారేపల్లి గ్రామాల్లో సంఘం బృందం పర్యటించి, రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న మోసాలను గుర్తించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ.. గిరిజన తండాల్లో వరి కొనుగోలు కేంద్రాలను నత్తన డకన నిర్వహిస్తున్నారన్నారు. వేలాది టన్నుల ధాన్యం రోడ్ల మీదనే ఉందని, ఇప్పటి వరకు సగం కూడా కాంటా చేయలేదని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన నిల్వ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ఐక్యరైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.దేవారం, జిల్లా కార్యదర్శి, ప్రధాన కార్యదర్శి బాబాన్న, కిషన్, కే.రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు వసూళ్లను ఆపాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

ఆర్మూర్ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ నియోజకవర్గంలో అధికారులు చేసిన బలవంతపు వసూళ్లను ఉన్నతాధికారులు గుర్తించి బాధితులకు అందజేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి బినామీల ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని విషయం తెలిసిన పీసీసీ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్‌రెడ్డి నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆదివారం పట్టణంలోని యోగేశ్వర కాలనీలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కరప్షన్ అంటేనే కాంగ్రెస్ పార్టీ అని ముద్రపడిందని ఆరోపించారు. అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి వసూళ్లకు పాల్పడుతున్నారని ప్రతి కార్యాలయంలో సీసీ కెమెరాలు పెట్టి అధికార పార్టీ నాయకులు పర్యవేక్షిస్తున్నారని ఉద్యోగులు చేసే ప్రతీ ఫైల్ ఇన్‌చార్జికి తెలియజేసే విధంగా ఒత్తిడి చేస్తూ వసూలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి ధనదాహానికి అధికారులు బలవుతున్నారని తెలిపారు. అవినీతికి కల్లెం వేయకుంటే కలెక్టర్ కార్యాలయంతో పాటు వివిధ కార్యాలయాల్లో పదివేల మంది ప్రజలతో కలిసి దండయాత్ర చేస్తానని ఆయన అన్నారు. నియోజకవర్గంలో కల్లు బట్టినుంచి నల్లమట్టి దాక మామూళ్లను వసూళ్లను చేస్తూ, చివరకు టిఫిన్ సెంటర్లలో లూటీలు చేస్తున్నారని ఆరోపించారు. అవినీతి దాహానికి అన్ని వర్గాల ప్రజలు బలవుతున్నారని విమర్శించారు. పేద, ధనిక తేడా లేకుండా కాంగ్రెస్ ఇన్‌చార్జి డబ్బులు దండుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్తారని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మెట్టు సంతోష్, మాజీ కౌన్సిలర్లు గంగమోహన్ చక్రు, అల్లపూర్ మహేందర్, పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, సీనియర్ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, పోల సుధకార్, నచ్చు చిన్నారెడ్డి, జిజి రావ్, సుంకరి రవి, పృథ్వీ, మీర శ్రావణ్, షైమద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం.. ఆయిల్ చోరీ

ముప్కాల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిసాన్ నగర్ శివారు నాగులకుంట చెరువు, రాంమందిర్ వెనుక ప్రాంతంలోని వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేసిన 5 ట్రాన్స్‌ఫార్మర్‌లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి వాటిలో నుంచి కాపర్ కాయిల్స్, ఆయిల్ చోరీ చేశారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఈఈ సబావత్ కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై శైలేందర్ ప్రజలను కోరారు. ట్రాన్స్‌కో ఏఈఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

వడ్ల బస్తాల అపహరణ

తాడ్వాయి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాజివాడి రైతు వేదిక వద్ద వేసిన వడ్ల బస్తాలను చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. ఆరుగాలం పండించి కష్టపడ్డ ధాన్యానికి సరైన ధర లేక కల్లాల్లోనే ఉంటున్న వడ్ల బస్తాలను సైతం దొంగలు ఎత్తుకపోవడంతో మరింత నష్టం చేకూర్చిందని రైతులు వాపోయారు. అధికారులు పర్యవేక్షణ లేక వడ్ల బస్తాలు దొంగతనాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కల్లాల్లో అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఇసుక తరలిస్తున్న ఆటోలు స్వాధీనం

రెంజల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాలీ ఆటోలను స్వాధీనం చేసుకునట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. బోధన్ నుంచి మూడు ట్రాలీ ఆటోలు అక్రమంగా ఇసుకను తీసుకువచ్చి దూపల్లి గ్రామంలో అమ్ముతున్నారన్న సమాచారం మేరకు ఆదివారం ఉదయం ఆటోలను పట్టుకుని సీజ్ చేశామన్నారు. ఆటో డ్రైవర్‌తో పాటు యజమానులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు అప్పగించామన్నారు.

పవర్ కోసం పాకులాట

- ఉప సర్పంచ్ పదవికి డిమాండ్
- చెక్ పవర్ కోసం ఆరాటం
- సర్పంచ్ రిజర్వేషన్ కలిసి రాని వారి ఆసక్తి
- పెరుగుతున్న పోటీదారులు
- పోరు మరింత రసవత్తరం



డొంకేశ్వర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అనుకూలంగా రానిచోట నాయకులు తమ ఆలోచనలు మార్చుకున్నారు. సర్పంచ్ కాకపోయినా చెక్ పవర్ ఉన్న ఉపసర్పంచ్ పదవిని దక్కించుకుందామని పైరవీలు చేసుకుంటున్నారు. వచ్చిన రిజర్వేషన్లకు చెందిన వారిని గుర్తించి వెంట ఉండేవారు. చెప్పిన మాట వినే అనుచరులను, లేదంటే వారి సతీమణి సర్పంచిగా బరిలోకి దింపి గెలిపించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సర్పంచి నుంచి వార్డు సభ్యుల వరకు తమకు అనుకూలమైన వారిని ఎంపికలు చేస్తున్నారు. దానికోసం నాయకులు రాత్రి పగలు తేడా లేకుండా చర్చలు జరుపుతున్నారు.

డొంకేశ్వర్ మండలంలో ఇదీ పరిస్థితి..

మండలంలో 13 గ్రామ పంచాయతీల్లో మొత్తం బీసీలకు 2, ఎస్సీలకు 3, ఎస్టీలకు ఒకటి, జనరల్‌కే 7 సర్పంచ్ స్థానాలు కేటాయించారు. మొత్తం 118 వార్డుల్లో ఎస్టీలకు 8, ఎస్సీలకు 25, బీసీలకు 26, జనరల్‌లకు 59 స్థానాలు రిజర్వ్ చేశారు. మండలంలో మొత్తం 16,760 ఓట్లు ఉండగా.. 9064మంది మహిళలు, 7696 మంది పురుషులు ఉన్నారు. కాగా ఈ ఎన్నికల్లో మహిళలు కీలక పాత్ర పోషించనున్నారు.

ఖర్చులన్నీ వారివే..

సర్పంచి, వార్డు సభ్యులుగా గెలవాలన్నా, ఉప సర్పంచ్‌గా ఎన్నుకోవాలన్న డబ్బులు ప్రధానం. ఇందుకు ఒక్కో గ్రామంలో ఒక్క విధంగా ఖర్చు ఉంటుంది. మండలకేంద్రాల్లో ఖర్చు రెండింతలు, మూడింతలు అవుతుంది. గ్రామాల్లో రూ.5 లక్షల నుంచి 10 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంటుందని ఆశావహులు అంచనాలు వేసుకుంటున్నారు. సర్పంచ్ బరిలో ఉండి అంత ఖర్చు పెట్టుకోలేని వారు.. ఉప సర్పంచ్ అవుదామనే ఆశతో ఉన్నారు. ఉపసర్పంచ్ కావాలనుకున్న వారు సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులకు ఎన్నికల్లో ఖర్చు పెట్టేందుకు అండగా నిలిచేందుకు ముందుకు వస్తున్నారు. ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందిన తరువాత గ్రామంలోని అభివృద్ధి పనులను తమకే అప్పగించాలని ముందస్తుగా ఒప్పందం చేసుకుంటున్నారు.

వార్డు సభ్యుల ఎంపిక కీలకం

ఉప సర్పంచ్‌గా బరిలో ఉండే నాయకుడు వార్డుల్లో నిలిపేందుకు గెలిచే వారిని ప్రధాన అనుచరులను ఎంపిక చేసుకుంటున్నారు. ఉప సర్పంచ్ కావాలంటే వార్డు సభ్యులకి చెప్పిన మాట వినే వారితోనే నామినేషన్ వేయించుకునేందుకు సిద్ధం చేశారు. వారికి అవసరమైన నామినేషన్ పత్రాలను పన్నుల చెల్లింపులు ధ్రువపత్రాలు తీసుకోవడం వంటి పనులన్నీ ఆ అభ్యర్థులే చూసుకుంటున్నారు.



వాహనాల తనిఖీ విధానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

సాలూర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ విధానం పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మండలంలోని అంతర్రాష్ట్ర సరిహద్దులో అధికారులు చేపడుతున్న వాహనాల తనిఖీని ఎంపీడీవో ఆదివారం పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులతో పాటు ఎంపీడీవో పలు వాహనాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్ఎస్‌టీ అధికారులు రఘువీర్, ముఖీం, పోలీస్ సిబ్బంది ఉన్నారు. సాలంపాడ్‌లోని నామినేషన్ కేంద్రాన్ని ఎంపీడీవో సందర్శించారు. ఎలాంటి సమస్యలున్నా అభ్యర్థులకు సమాచారం అందించి తప్పులను సరిచేశామన్నారు. నామినేషన్ పత్రాల పరిశీలన పకడ్బందీగా చేపట్టామని వివరించారు.



భీమ్‌గల్ వాసులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సునీల్‌కుమార్

అభివృద్ధితోనే కాంగ్రెస్‌కు ఆదరణ

భీమ్‌గల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని ఆదరించి ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణానికి చెందిన పలువురు మోర్తాడ్‌లోని ప్రజా నిలయంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి సునీల్ కుమార్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిలో భాగస్వామిగా ఉంటూ మరిన్ని ప్రగతి పనులు చేసేందుకు, నిరంతరం కార్యకర్తలకు తోడుగా ఉంటానని సునీల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు జేజే నర్సయ్య, అనంతరావు, మల్లెల లక్ష్మణ్, కన్నె సురేందర్, నల్లూరి శ్రీనివాస్, కిరణ్, మహేష్, అంజు, దినేష్, సతీష్, రాజేందర్, రాజన్న ఉన్నారు.

కమ్మర్‌పల్లి: మండలకేంద్రంలోని సుమారు 50 మంది మున్నూరుకాపు సంఘం సభ్యులు కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకెట రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు గణేష్ గౌడ్, సింగిరెడ్డి శేఖర్, కిషన్ గౌడ్, ప్రదీప్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలను నిశితంగా పరిశీలించాలి

- జిల్లా ఎన్నికల పరిశీలకుడు శ్యాం ప్రసాద్ లాల్

కోటగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ పత్రాలను నిశితంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు శ్యాం ప్రసాద్ లాల్ సూచించారు. కోటగిరి, పోతంగల్ మండల కేంద్రాల్లోని నామినేషన్ల కేంద్రాలలో ఆదివారం నామినేషన్ల స్క్రుటినీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నామినేషన్ పత్రాలలో కులం, సంతకాలు క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు ఉండొద్దని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవోలు చందర్, విష్ణు, ఎన్నికల అధికారులు శంకర్, శ్రీనివాస రావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



పోతంగల్‌లో నామినేషన్ల స్క్రుటినీ పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు శ్యాం ప్రసాద్ లాల్



పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల గురించి చర్చిస్తున్న ఎంపీడీవో గంగాధర్, సీఐ

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- ఆలూర్ ఎంపీడీవో గంగాధర్

ఆలూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో గంగాధర్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను ఎంపీడీవో గంగాధర్, సీఐ సత్యనారాయణ గౌడ్ ఆదివారం పరిశీలించారు. పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ ఏర్పాటు చేయాల్సిన సదుపాయాలు, భద్రత చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, షెడ్లు, చీకటి ప్రాంతాల్లో లైట్లు వంటివి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ప్రతీ ఒక్కరు చట్టాలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. ఎవరైనా ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందుగానే పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల ర్యవేక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అండర్-20 కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

ముప్కాల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భూదేవి ఇండోర్ స్టేడియంలో నిజామాబాద్ జిల్లా అండర్- 20 బాలబాలికల కబడ్డీ జట్లను ఆదివారం ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. డిసెంబర్ 2 నుంచి 4 వరకు నల్గొండ జిల్లా హాలియాలో బాలురకు, 5నుంచి 7 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లా కబడ్డీ అసోసియే షన్ అధ్యక్ష, కార్యదర్శులు అంద్యాయల లింగయ్య, గంగాధర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

మూడో విడత నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

వేల్పూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా 3వ విడతలో వేల్పూర్ మండలంలో డిసెంబరు 3 నుంచి సర్పంచ్‌లు, వార్డు స్థానాల నామినేషన్ స్వీకరణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంపీడీ వో బాలకిషన్ తెలిపారు. మండలంలో 18 గ్రామాలకు గాను 5 క్లస్టర్‌లను ఏర్పాటుచేసి నామినేషన్‌ల స్వీకరణ సెంటర్లను ఏర్పాటుచేశామన్నారు. పడిగెల్ జీపీ సెక్టర్‌లలో పడిగెల, లక్కోర, పోచంపల్లి, హనుమాన్ నగర్, అంక్సాపూర్ సెంటర్‌లో అంక్సాపూర్‌తో పాటు కోమన్‌పల్లి, కుకునూర్, వేల్పూర్ సెంటర్‌లో అమీనాపూర్, సాహెబుపేట్, వెంకటాపూర్, మోతె సెంటర్‌లో రామన్నపేట్, అక్లూర్, పచ్చల నడ్కుడ సెంటర్‌లో కొత్తపల్లి, వాడి, జాన్కంపేట్ గ్రామాల సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్‌ల స్వీకరణ చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భీమ్‌గల్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెండోరా గ్రామానికి చెందిన సత్యం గుండెపోటుతో మరణించారు. అతనికి పదేళ్ల కుమారుడు మహర్ష్ ఉన్నాడు. ఇదివరకే అతని భార్య చనిపోయింది. తల్లిదండ్రులను కోల్పోయి ఆ బాలుడు అనాథగా మిగిలాడు. ఆదివారం వారి కుటుంబ సభ్యులను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. ఆ బాలుడికి ధైర్యాన్ని కల్పించి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని, భవిష్యత్తులో ఆ బాలుడి చదువుకి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఉత్సవాలు.. సామూహిక హోమాలు



ఏర్గట్ల మండలకేంద్రంలో బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కలిగోట్‌లో ఖండేరాయుడి రథోత్సవం

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్ గ్రామంలో ఆదివారం శ్రీ ఖండెరాయుడు రథోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథాన్ని ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో రథానికి స్వాగతం పలికారు. అనంతరం స్వామికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం తొర్లికొండలో అగ్గిమల్లన్న జాతర నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఏర్గట్లలో మల్లన్న స్వామి ఉత్సవాలు

ఏర్గట్ల: మండల కేంద్రంలోని మల్లన్న స్వామి ఆలయ ఉత్సవాలు యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమాయ్యాయి. ఆదివారం స్వామికి బోనాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని యాదవ సంఘాల మహిళలు పాల్గొని స్వామికి సమర్పించారు. సోమవారం ఆలయం వద్ద అన్నప్రసాదం, జాతర నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

అయ్యప్ప ఆలయంలో సామూహిక హోమం

నవీపేట: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక హోమం నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న మహాకుంభాభిషేక మహోత్సవంలో భాగంగా 3 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. 2వ రోజైన ఆదివారం గణపతి పూజ, పుణ్యవచనం, స్థాపిత మండప దేవతా పూజ, సామూహిక హోమం, సుదర్శన హోమం, సహస్ర కలశ స్థాపన, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో మహా చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



నవీపేటలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గజ్జెలమ్మ జాతరకు ముస్తాబు

వర్ని: మండలం తగిలే పల్లి గ్రామంలో మంగళవారం నుంచి ఊరంతా సంబరాలు జరుగనున్నాయి. గజ్జలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా గ్రామ ప్రజలు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం రాత్రి 10 గంటల నుంచి డప్పు చప్పుళ్లతో జాతర ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. మంగళవారం తెల్లవారు జామున నుంచి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పిస్తారు. గజ్జెలమ్మ, ఊరడమ్మ, కట్ట రాజులు, లక్ష్మమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. సాంప్రదాయ ప్రకారం జంతు బలి నిర్వహిస్తారు.

డొంకేశ్వర్: మండలంలోని సిర్పూర్ గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా తయారు చేయించిన మల్లన్న స్వామి పల్లకిని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాలతో మంగళ హారతులతో గ్రామస్తులంతా ఊరేగింపు నిర్వహించారు.



కలిగోట్‌లో షిడిని ఊరేగిస్తున్న భక్తులు

సంతాన నాగమ్మ ఆలయ వార్షికోత్సవం

బోధన్: బోధన్ పట్టణంలోని ఏక చక్రనగర్లో గల సంతాన నాగమ్మ ఆలయ 16వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

హంపీ పీఠాధిపతికి ఘన స్వాగతం

నవీపేట: హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామికి ఆదివారం రాత్రి మండల కేంద్రంలో ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక అయ్యప్ప ఆలయంలో జరుగుతున్న మహా కుంభాభిషేకం, ఉత్సవంలో పాల్గొనడానికి ఆయన నవీపేటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే గేట్ నుంచి హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామిని ప్రత్యేక రథంలో తీసుకువచ్చి స్వాగతం పలికారు.



పూజలు చేస్తున్న హంపీ పీఠాధిపతి



తగిలేపల్లిలో గజ్జెలమ్మ ఆలయంలో కొలువుదీరిన అమ్మవార్లు



సిర్పూర్‌లో పల్లకి ఊరేగింపు దృశ్యం




సర్పంచ్‌కు మేడమ్ పంచ్..!

- భార్యలను బరిలో దింపేందుకు సన్నద్ధం
- జోరందుకున్న ఎన్నికల హడావుడి

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేయగా మెజార్టీ స్థానాలు మహిళలకే దక్కాయి. కామారెడ్డి జిల్లాలో 532 గ్రామ పంచాయతీలు ఉండగా 242 సర్పంచ్ స్థా నాలు అతివలకే దక్కాయి. అంతేకాకుండా అన్‌రిజర్వ్‌డ్ స్థానాల్లో సైతం పోటీలో ఉంటా మంటున్నారు. ఎన్నికల్లో భార్యలను పోటీలో దించేందుకు భర్తలు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు ఆయా పార్టీల అండదండల కోసం భర్తలు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రభుత్వ సలహా దారులు, మాజీ ఎమ్మెల్యేల వద్దకు క్యూకట్టారు.

భార్యలను బరిలో దింపేందుకు..

పల్లె పోరులో మహిళలకే ఎక్కువ స్థానాలు కేటాయించడంతో పలువురు నాయకులు తమ భార్యలను పోటీలో దింపేందుకు తాపత్రయ పడుతున్నారు. ఇందుకు పార్టీ మద్దతు చూరగొనేందుకు భర్తలు శతప్రయత్నాలు చేస్తున్నారు. ఓ వైపు ప్రజలను మచ్చిగా చేసుకునేందుకు మందు, విందు ఏర్పాటుచేస్తున్నారు. ఒక వేళ పార్టీ అండదండలు దక్కకపోతే స్వతంత్రంగా పోటీ చేసేందుకు సైతం సిద్ధమయ్యారు. ఒక్కో పార్టీ నుంచి ఐదారుగురు ఆశావహులు ఉండటంతో ఆయా పార్టీ పెద్దలకు తలనొప్పిగా మారింది. మద్దతు ఇవ్వని వ్యక్తులకు సర్ది చెప్తున్నట్లు తెలుస్తోంది.



సెంటిమెంట్ కలిసొస్తుందని ఆలోచన

సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ పరంగా అవకాశం దక్కకపోయినా చాలామంది బరిలో నిలిచేందుకే సిద్ధమవుతున్నారు. ఒకవేళ పోటీ చేసి ఓడినా ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేయవచ్చని ఆలోచిస్తున్నారు. సెంటిమెంట్ కలిసివస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



భిక్కనూరులో భార్యతో నామినేషన్ వేయిస్తున్న మాజీ సర్పంచ్ తునికి వేణు

జోరందుకున్న ఎన్నికల హడావుడి..

గ్రామాల్లో ఎన్నికల హడావుడి ఊపందుకుంది. జిల్లాలో మొదటి విడత ఎన్నికల్లో భాగంగా ఆశావహులు నామినేషన్లను దాఖలు చేస్తుండగా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి చాలామంది ప్రచారం ముమ్మరం చేశారు.

- భిక్కనూరు, ఆంధ్రజ్యోతి

అప్పట్లో జీతం నిల్.. ఇప్పుడు రూ.6500



గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీ చేసి, గెలిచేందుకు ఆశావహులు పెద్దసంఖ్యలో ఉత్సాహం చూపుతున్నారు. సర్పంచ్ పదవి దక్కించుకోవడానికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. అయితే వారి ఉత్సాహం, గెలవడానికి వారు పెడుతున్న ఖర్చు చూసి సర్పంచ్‌కు ఎంత వేతన మొస్తుందో, ఆ పదవితో ఎంత ఆదాయం సమకూరుతుందోనని ప్రజలు అనుకుంటారు. కానీ సర్పంచ్‌గా గెలిస్తే నెలవేతనం రూ.6500 మాత్రమే.

1992కు ముందు వేతనాలు లేవు..

1992 ముందు సర్పంచ్‌లకు వేతనాలు లేవు. ఆ తర్వాత చిన్న గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు రూ.600, మేజర్ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు రూ.1000 మాత్రమే ఇచ్చేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక అప్పటి సీఎం కేసీఆర్ 2015 ఏప్రిల్ 1 నుంచి సర్పంచ్ వేతనం రూ.5వేలు చేశారు. ఆ తర్వాత 2021లో రూ.6500లకు పెంచారు. 2018 తర్వాత నుంచి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినా ప్రభుత్వ బిల్లులు చెల్లించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడంతో చిల్లిగవ్వ ఆదాయం రాకపోగా పనులు చేయడానికి తెచ్చిన అప్పులకు వడ్డీలు మీద పడుతున్నాయని పలువురు వాపోతున్నారు. తక్కువ వేతనం, పనులు చేసినా పైసలు రానప్పుడు అంత ఖర్చు చేస్తారంటే సర్పంచ్ ఆ గ్రా మానికి ప్రథమ పౌరుడు. ఆ హోదా కోసం అప్పులు చేసైనా గెలుపొందాలని ఆలోచిస్తున్నారు.

- బోధన్, ఆంధ్రజ్యోతి

ముమ్మరంగా వాహన తనిఖీలు



తహసీల్దార్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న డోంగ్లి రెవెన్యూ సిబ్బంది

మద్నూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు వాహన తనిఖీలు చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృంద సభ్యులు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం మద్నూర్ తహసీల్దార్ ముజీబ్ వాహనాన్ని డోంగ్లి రెవెన్యూ సిబ్బంది సాయిబాబా తనిఖీ చేశారు. అధికారులు సైతం తమ వాహనాలను తనిఖీ చేయడానికి ఎలాంటి అభ్యంతరాలు చెప్పడం లేదని చెబుతున్నారు. మహారాష్ట్ర నుంచి మద్యం, డబ్బు అక్రమంగా రాష్ట్రంలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు.

పీడీఎస్‌యూ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సభ్యులు

ఆర్మూర్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 23వ జిల్లా మహసభలలో శనివారం రాత్రి జిల్లా పీడీఎస్‌యూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా సహాయ కార్యదర్శి బి.ప్రిన్స్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా గౌతమ్ కుమార్(బోధన్), ప్రధాన కార్యదర్శిగా జన్నారపు రాజేశ్వర్ (నిజామాబాద్), ఉపాధ్యక్షుడిగా కార్తీక్(వర్ని), సహాయ కార్యదర్శిగా ప్రిన్స్(ఆర్మూర్), కోశాధికారిగా సాయినాథ్(కోటగిరి)ని ఎన్నుకున్నారు. అదేవిధంగా జిల్లా కార్యవర్గ సభ్యులుగా నిఖిల్, మనోజ్, సాయికిరణ్, పవన్, భవాని, హుస్సేన్, రాహుల్, గణేష్, ఆకాష్, బలరామ్, నిత్యశ్రీ, మాదురి, హరికృష్ణ, రాకేష్, గౌతమ్‌రాజ్, అక్షయ్‌లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

అఖండ హరినామ సప్తాహ ప్రారంభం



బరంపేడ్గిలో సప్తాహలో కీర్తనలు పాడుతున్న వార్కారీలు

బీర్కూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం బరంగ్ ఏడ్గి గ్రామంలోని స్థానిక హనుమాన్ ఆలయంలో ఆదివారం 28వ దత్త జయంతి సందర్భంగా అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామప్ప మహరాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుంది. వార్కరీలు భజనలు, కీర్తనలతో భక్తి పారవశ్యంలో భక్తులను ముంచెత్తారు. ఈ కార్యక్రమం వారం పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

హెచ్ఐవీ బాధితులకు దుప్పట్ల పంపిణీ

కామారెడ్డిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో శ్రీరామసేవాసమితి ఆధ్వర్యంలో 35 మంది హెచ్ఐవీ బాధితులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేవాసమితి ఆధ్వర్యంలో పలుసేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు వ్యాధులతో బాధపడుతున్న వారికి తోచిన సహాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు నర్సింలు, గిరిధర్, కిషన్, ప్రభాకర్, వెంకటేష్, జిల్లా మెడికల్ ఆఫీసర్ స్నేహ, ప్రీతి, మానిటరింగ్ కో-ఆర్డినేటర్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దామరంచ గ్రామంలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

బీర్కూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం దామరాంచ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007- 2008 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్ననాడు వారికి బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు వారి చదువుకునే రోజుల్లో జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇన్నేళ్ల తరువాత చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు కొంత నగదును అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



అయ్యప్ప ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న స్వాములు

భిక్కనూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంలోని అయ్యప్ప ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప ఆలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా అయ్యప్ప ఉత్సవ విగ్రహాలను తీరొక్క పూలతో అలంకరించిన ప్రత్యేక వాహ నంలో పెట్టి ఊరేగించారు. వాహనం ఎదుట అయ్యప్ప స్వాములు నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. ఈ మేరకు అయ్యప్ప స్వాములు భిక్షాటన చేశారు. అనంతరం స్వాములు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం భిక్కనూరు పట్టణంలో అయ్యప్ప విగ్రహాల ఊరేగింపును నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రెండో విడత నామినేషన్ల స్వీకరణ

నిజాంసాగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నిజాంసాగర్ మండలంలో ఆదివారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలో నాలుగు క్లస్టర్లలో అధికారులు నామినేషన్లను స్వీకరిస్తుండగా ఈ నెల 2వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. మొదటిరోజు మండలంలోని అచ్చంపేట గ్రామానికి సంబంధించి 3 నామినేషన్లు రాగా గోరుగల్ గ్రామ సర్పంచ్ పదవికి ఒక నామినేష్, వార్డు స్థానాలకు ఆరు నామినేషన్లు, నర్సింగ్‌రావుపల్లి, మల్లూరుకు ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఈ 4 క్లస్టర్‌లకు అధికారులుగా రమేష్, స్వరూప, బాల్‌కిషన్ వ్యవహరించనున్నారు. ఈ నెల 2 వరకు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు స్వీకరణ ఉంటుందని తెలిపారు.



గోరుగల్‌లో నామినేషన్లు స్వీకరిస్తున్న అధికారులు

భిక్కనూరు మండలంలో భారీగా నామినేషన్లు

భిక్కనూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని 18 గ్రామపంచాయతీలకు గాను పెద్దఎత్తున నామినేషన్లు వచ్చాయి. ఆదివారం ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. 18 గ్రామ పంచాయతీలకు గాను 134 నామినేషన్లు వచ్చాయని, 182 వార్డు స్థానాలకు 544 నామినేషన్లు వచ్చాయన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటిస్తూ ఎన్నికల విజయవంతానికి కృషిచేయాలన్నారు.

లింగంపేట మండలంలో ఎనిమిది..

లింగంపేట, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలో రెండో దశలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. మండలంలో 41 గ్రామ పంచాయితీలకు 8 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. 342 వార్డులకు గాను 5 నామినేషన్లు వచ్చాయన్నారు. డిసెంబరు 2 వరకు నామినేషన్లు స్వీకరించనున్నామని చెప్పారు. నామినేషన్లు వేసేందుకు మొత్తం 12 కేంద్రాలను ఏర్పాటుచేశామని తెలియజేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ముస్తాపూర్‌లో నామినేషన్ వేస్తున్న సర్పంచ్ అభ్యర్థి రాధ

నాగిరెడ్డిపేట మండలంలో 14..

నాగిరెడ్డిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా ఆదివారం తొలిరోజు రెండో విడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. కాగా మండలంలోని సర్పంచ్ స్థానాలకు 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్టు ఎంపీడీవో లలిత కుమారి తెలిపారు. చీనూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి ముగ్గురు, గోలి లింగాల్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఇద్దరు, అక్కంపల్లి, బొల్లారం, ధర్మారెడ్డి, జలాల్ పూర్, లింగంపల్లి, మాటూర్ మాసానిపల్లి, మెల్లకుంట తండా, తాండూర్, పోచారం గ్రామాల సర్పంచ్ స్థానాలకు ఒక్కరు చొప్పున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆమె తెలిపారు. అలాగే వివిధ గ్రామపంచాయతీల వార్డులకు గాను 14 మంది అభ్యర్థులు వార్డు సభ్యులుగా నామినేషన్లు దాఖలు చేసినట్టు ఆమె తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సదాశివనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల దృష్ట్యా మండలంలోని రోడ్ల వెంబడి వాహనాల తనిఖీని అధికారులు ముమ్మరం చేశారు. ఎస్సై పుష్పరాజ్, తహసీల్దార్ సత్యనారాయణ ఆదేశాల మేరకు సదాశివనగర్ పీసీ సత్యయ్య, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది నర్సింగ్‌రావు ఆదివారం ఉత్తునూర్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనల పాటించాలన్నారు. అందుకు విరుద్ధంగా ఎవరైనా డబ్బు, మద్యాన్ని సరఫరా చేస్తే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామన్నారు.

ఘనంగా గీతాజయంతి ఉత్సవాలు



గీతాపారాయణం చేస్తున్న భక్తులు

కామారెడ్డిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి గీతాపరివారం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం గీతాజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గీతాపరివార్ ప్రతినిధి సోమిశెట్టి గంగారాం పర్యవేక్షణలో 18 అధ్యాయాల పారాయణం చేశారు. భగవత్ గీతలోని సారాంశాన్ని వివరించారు. కార్యక్రమంలో మహంతి గాంధారి కార్‌బాబా, మందిర నిర్వహణకమిటీ ప్రెసిడెంట్ శివాజీరావు, గీతాపరివార్ సభ్యులు ప్రసాద్, రఘుకుమార్, సుదర్శన్, మమత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులు సహకరించాలి



గాంధారిలో నామినేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

గాంధారి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గాంధారి మండలకేంద్రంలోని నామినేషన్ కేంద్రాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ సెంటర్‌లోకి కేవలం నామినేషన్ వేసేవారితో పాటు బలపరిచే వారిని మాత్రమే అనుమతి ఇవ్వాలని సూచించారు. అభ్యర్థులు ఎన్నికల, పోలీసు అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ సీఐ సంతోష్, ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులకు సన్మానం




ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న షబ్బీర్ అలీ

మాచారెడ్డి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏకగ్రీవంగా ఎన్నికైన ఎల్లంపేట, వెంకిరెడ్డిపల్లి తాండా, బోడగుట్ట తండా, వెనుక తండా సర్పంచ్, ఉపసర్పంచ్ వార్డుసభ్యులను ఆదివారం ప్రభుత్వసలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ ఎంపీపీ నర్సింగ్‌రావు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఏకగ్రీవం చేసినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

నాగిరెడ్డిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని ధర్మారెడ్డి గ్రామానికి చెందిన చౌహన్ అలియాస్ కమ్మరి లక్ష్మి (26) శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలి భర్త వినోద్ కుమార్ మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతని బీమా, ఆస్తి డబ్బుల విషయం లో భర్త వినోద్ తరపు బంధువులతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నా యని అన్నారు. ఈ విషయమై పెద్దల సమక్షంలో రాజీ పడ్డారని తెలిపారు. ఈ నెల 24న లక్ష్మిని ఆమె తల్లిదండ్రులు ధర్మారెడ్డిలోని అత్తమామల ఇంట్లో ఉంచా రన్నారు. కాగా ఆస్తి, బీమా డబ్బుల విషయంలో జరిగిన గొడవల కారణంగానే తన కూతురు లక్ష్మి మృతిచెందిందని, ఆమె మృతిపై అత్త మామలతో పాటు ఇతర కుటుంబ సభ్యులపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి తల్లి చౌహన్ శాంతాబాయి ఫిర్యాదుచేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతురాలికి ఒక కూతురు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నట్లు ఎస్సై వివరించారు.

సెలవు పూట.. సుక్క లేక



బోధన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల నామి నేషన్ల పర్వం పూర్తయింది. కాగా గ్రామాల్లో మందుల దావత్ మొద లైంది. ఎన్నికల్లో నామినేషన్ల వారిని ఉపసంహరించుకునేలా చేసేందుకు మందు దావత్‌లు పెట్టి బుజ్జగించడం ఆనవాయితీ. కానీ మందు కొరత ఇందుకు అడ్డంకిగా మారిందని చర్చ సాగుతోంది.

కొత్తగా మద్యం దుకాణాల టెండర్లతో

ప్రభుత్వం ఇటీవల కొత్తగా మద్యం దుకాణాలకు టెండర్లు వేసింది. టెండర్లు దక్కించుకున్న వారికి ఈ నెల 1వ తేదీ నుంచి మద్యం విక్రయించేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇక పాత మద్యం దుకాణాలు నడిపిన వారు పెద్ద మొత్తంలో కాకుండా చిన్న మొత్తంలోనే మద్యం తెప్పించి 15 రోజుల నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. దీంతో ఎన్నికల వేళ నిల్వ ఉన్న మద్యం అంతా ఖాళీ అయిపోయింది. ఆదివారం ఉదయం నుంచే వైన్స్ షాప్‌లలో మందు లభ్యం కాకపోవడంతో మందుబాబులు ఆదరబాదరగా తిరిగారు. అందుబాటులో ఉన్న చోటు నుంచి తెప్పించుకుంటున్నారు.

సాయంత్రానికి ఖాళీ

ఆదివారం ఉదయం బోధన్‌లో ఒకటి రెండు వైన్స్ షాప్‌లలో మద్యం లభించినప్పటికీ సాయంత్రం అయ్యే సరికి మందు ఖాళీ అయింది. దీంతో మద్యం ప్రియులకు నిరాశ ఎదురైంది. చేసేదేమీ లేక బార్ షాప్‌లకు బారులు తీరారు. క్వార్టర్ సీసాకు డబ్బులు ఎక్కువైనప్పటికీ వైన్ షాప్‌ల కంటే బార్ షాప్‌లలో మద్యం రేటు ఎక్కువైనప్పటికీ కొనుగోళ్లకు వెనకాడలేదు. బార్ షాప్‌ల నుంచే గ్రామాలకు మద్యం తరలివెళుతుంది. రేపు ఉదయాని కల్లా వైన్స్ షాప్‌లో మందు అందుబాటులో ఉంటే బాగుంటుందని మద్యం ప్రియులు కోరుకుంటున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మద్దతుదారులు



కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కలిసిన బీజేపీ మద్దతుదారులు

రాజంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన ఆరు గ్రామాల సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు వేసిన బీజేపీ మద్దతుదారులు ఆదివారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా మద్దతుతో ఎన్నికల్లో గెలవాలని సూచించారు. ప్రతి అభ్యర్థికి బీజేపీ కార్యకర్త నుంచి ముఖ్యనాయకుడి వరకు సంపూర్ణ మద్దతు ఉంటుందని, ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలియజేస్తూ వాటి పరిష్కారాలను ఎలా చూపుతారో తెలియజేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతిరోజు పర్యటిస్తూ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పిట్ల శ్రీను, కుంట లావణ్య సాయిబాబా, కుమ్మరి రమేష్, బక్కి సంధ్య బాలరాజ్, కామిశెట్టి నరేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ గంగారెడ్డి, గ్రామ అధ్యక్షులు రాజిరెడ్డి, సాయిరెడ్డి, సంతోష్, నాయకులు గిరిధర్, సతీష్ చంద్రం, లింగం, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ధర్పల్లిలో పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములు

వైభవంగా అయ్యప్ప పడిపూజ

ధర్పల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండ ల కేంద్రంలో అయ్యప్ప మహాపడిపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి అల్లడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పసుపునూరి ప్రవీ ణ్ కుమార్ అయ్యప్ప మాల 18వ సంవ త్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రం లోని పద్మశాలీ సంఘం భవనంలో అయ్యప్ప స్వామి పడిపూజను కనులపండువగా నిర్వహించారు. గణపతి, గౌరీ, పుణ్యాహవచనం, కుమారస్వామి పూజలు నిర్వహించి అయ్యప్ప విగ్రహానికి అభిషేకాలు, భజన కార్యక్రమాలు చేశారు. 18సార్లు మాల ధరిస్తే అయ్యప్ప స్వామి పరిపూ ర్ణ దర్శనం లభిస్తుందని శ్రీనివాస్ గురుస్వామి అన్నారు. కార్యక్రమంలో గురు స్వామి తిరుపతి రెడ్డి, డాక్టర్ నందు, రమణ, గంగాధర్, భూమేష్, అశోక్, ప్రవీణ్, కుటుంబ సభ్యులు, రాధిక నాగరాజ్, సుహాస్, సోనాలి, మమత శివకుమార్, నిఖిల, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్లు

స్వీపర్లకు రూ.26వేల వేతనం ఇవ్వాలి

నిజామాబాద్‌రూరల్,నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్లకు కనీస వేతనం రూ. 26 వేల ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్య దర్శి వై. ఓమయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం శ్రమ దోపిడీకి పాల్పడుతుందని, 2గంటలు పని చేయాల్సిన కార్మికులు ఉదయం 7 నుంచి సా యంత్రం 5గంటల వరకు ప్రభుత్వ పాఠశాలల్లో అనేక పనులు చేస్తున్నారన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ఏఐటీయూసీ ప్రభుత్వ పాఠశాల స్వీపర్లు స్కావెంజర్ల యూనియన్ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ల్లోనే కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంద న్నారు. కార్మికులకు తమ వేతనాలను నగదు రూపంలో కాకుండా బ్యాంకు ఖాతా ద్వారా వేత నాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు, అపాయింట్మెంటు లెటర్లు, పీఎఫ్, ఈఎస్‌ఐ, ఇన్సూ రెన్స్ సౌకర్యం కల్పించాలని, మాస్కులు, గ్లౌజు లు, బూట్లు, సబ్బులు, టావెల్స్ ఇవ్వాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.2వేల నుంచి తోచిన పదతుల్లో తక్కువ వేతనాలు చెల్లిస్తున్నా రన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు చక్రపాణి, జిల్లా అధ్యక్షురాలు వసంత, రాధామాధవి, దేవీ, లత పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం


మండప ఆరాధన చేస్తున్న పండితులు, అర్చకులు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బోర్గాం(పి) పరిధిలోని లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవ పూజలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో గణపతి, గౌరీ, పుణ్యాహవచన పూజలు నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో అఖండ దీపాన్ని వెలిగించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రాంగణంలో మండపాన్ని ఏర్పాటు చేసి ఆరాధన పూజలు చేశారు. ప్రత్యేక గణపతి, రుద్ర హోమాలు నిర్వహించి స్వామికి అష్టోత్తర శతకలశాలతో అభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపారు. ఆలయ పరిసరాల్లో నిర్వహించిన అన్నప్రసాదంలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మానవాళిని నడిపించేది భగవద్గీత

నేడు గీతా జయంతి

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జయ భగవద్గీతే హరిహీయ కమల విహారిని సుందర సుపనితే జయ భగవద్గీతే... భగవద్గీత గ్రంథం ఈ శ్లోకాన్ని ప్రపంచానికి అందించింది. శ్రీకృష్ణుడు మానవాళిని సరైన మార్గంలో నడిపించడానికి అర్జునుడిని కర్తగా చేసుకొని బోధించిన గ్రంథమే భగవద్గీత. కురుక్షేత్ర సంగ్రామంలో యుద్ధ భూమిలో ఎదురుగా ఉన్న బంధువర్గాన్ని, గురువును చూసి తన కర్తవ్యాన్ని మర్చిపోయి చూస్తున్న అర్జునుడికి కర్తవ్యాన్ని గుర్తు చేస్తూ గీతోపదేశం చేశాడు. మార్గశిరమాస శుక్లపక్ష ఏకాదశి రోజున శ్రీకృష్ణుడు భగవద్గీతను ఉపదేశించినట్లు చరిత్ర చెబుతుంది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు మానవాళికి కర్తవ్యాన్ని బోధిస్తూ ఏ విధంగా ఉండాలో తెలియజేశాడు. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు ఏ విధంగా మలుచుకొని లక్ష్యం వైపు పయనించాలో గ్రంథం సూచిస్తుంది. భగవద్గీతలోని ప్రతి అధ్యాయంలోని శ్లోకం ఉత్తేజాన్ని అందిస్తూ ముందుకు వెళ్లమని స్ఫూర్తినిస్తుంది. గీతా జయంతి భగవద్గీతను అర్జునుడు, భగవంతుని స్వరూపుడైన శ్రీకృష్ణుడి మధ్య సంభాషణ రోజును సూచిస్తుంది. హిందూ సాంప్రదాయంలో భగవద్గీత గ్రంథాన్ని పవిత్రమైన గ్రంథంగా భావిస్తారు. ఎన్నో పరిశోధనలు చేసి భగవద్గీత గ్రంథం చదవడం వల్ల కొత్త ఆలోచనలు కలిగి లక్ష్యాన్ని చేరుకోగలమని తెలియజేశాయి. శ్రీకృష్ణుడు అర్జునుడికి అబిజ్ఞ స్థితిని సరిదిద్దే చర్యలో భాగంగా జ్ఞానము, కర్మ, భక్తి భావాలను పునఃనిర్మాణం చేశాడని భగవద్గీత చెబుతుంది.

విద్యార్థి దశ నుంచే ప్రచారం...

శ్రీకృష్ణుడు మానవాళికి అందించిన గొప్పనైన గ్రంథం భగవద్గీత. భగవద్గీత అంచిన రోజును గీతాజయంతిగా నిర్వహించడం జరుగుతుంది. విద్యార్థుల్లో భగవద్గీత గ్రంథాన్ని పరిచయం చేయడంలో భాగంగా ఏటా భగవద్గీత కంఠస్థ పోటీలను నిర్వహిస్తున్నాం. ప్రతీనెల గీతాభవన్‌లో పౌర్ణమి పూజలు, ఆదివారం భగవద్గీత అంశాలపై సమావేశం, గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నాం.

- ప్రభాకర్‌రావు, అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలి కార్యదర్శి.

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి పీసీసీ చీఫ్‌ను విమర్శించే స్థాయిలేదు

నిజామాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ ఎమ్మె ల్యే ప్రశాంత్‌రెడ్డికి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను విమర్శించేంత స్థాయి లేదని కాంగ్రెస్ ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు సుభాష్ జాదవ్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రిగా పనిచేసిన ప్రశాంత్‌రెడ్డి కేవలం బాల్కొండ వరకే పరిమితమయ్యారని విమర్శించారు.


వరదల తాకిడికి బురదలో సోయా పంట(ఫైల్)


జిల్లాలో వరదలతో పంట పొలాల్లో తేలిన ఇసుక మెట్టలు(ఫైల్)

పంట నష్ట పరిహారం ఏదీ?

- హామీకే పరిమితమైన సర్కార్ సాయం
- ఎకరాన రూ.10 వేలు ప్రకటించి రెండు నెలలు అవుతున్నా అందని పరిహారం
- భారీ వర్షాలు, వరదలతో 24,473 ఎకరాల్లో తీవ్రంగా దెబ్బతిన్న పంటలు
- 24,809 మంది రైతులకు వాటిల్లిన నష్టం
- నాగిరెడ్డిపేటలో 2,665 ఎకరాల్లో ఎక్కువగా నష్టం
- పంట నష్టానికి రూ.25.97 కోట్లు అవసరం
- పరిహారం కోసం బాధిత రైతులకు తప్పని నిరీక్షణ

కామారెడ్డి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల వరదలు అన్ని వర్గాల ప్రజలను అతలాకుతలం చేశాయి. ప్రధానంగా ప్రభుత్వ ఆస్తులతో పాటు రైతుల పంటలకు తీవ్ర నష్టం చేకూర్చిన విషయం తెలిసిందే. ధ్వంసమైన రహదారులు, బ్రిడ్జిలు, నీటి వనరులకు తాత్కాలిక మరమ్మత్తులు చేశారు. అయితే తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలకు మాత్రం పరిహారం అందలేదు. వరదల సమయంలో జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సైతం పర్యటించి ఆదుకుంటామని హామీ ఇచ్చిన సర్కార్ సాయం చేయలేకపోయింది. ఇప్పటికే రైతులు వరదలు, వర్షాల వల్ల పంటల దిగుబడులు రాక పెట్టిన పెట్టుబడులు వెళ్లలేని పరిస్థితి ఎదురైంది. కనీసం ప్రభుత్వమైన దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో 24 వేల ఎకరాలకు పైగా భారీ వర్షాలతో పంటలు దెబ్బతినగా 24 వేల మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టపరిహారం కోసం బాధిత రైతులకు నిరీక్షణ తప్పడం లేదు.


జిల్లాలో వరి పంట పొలాల్లోకి కొట్టుకువచ్చిన రాళ్లు, రప్పలు(ఫైల్)

రైతులకు భారీగా నష్టం

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో 24,809 మంది రైతులకు సంబంధించి 24,473 ఎకరాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిని నష్టం వాటిల్లినట్లు అధికారులు గతంలోనే నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఎక్కువగా నాగిరెడ్డిపేట మండలంలో 2,665 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 669 ఎకరాల్లో ఇసుక మేటలు వెలిసినట్లు గుర్తించి ఆ ఇసుక మేటలను ఉపాధిహామీ కూలీల చేత తొలగించారు. కొన్నిచోట్ల ఇసుక మేటలు అలాగే ఉన్నాయి. కనీసం యాసంగి పంటలోనైన భూమి సాగుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.


వరదల తాకిడికి సోయా, వరిపైరు నేలకొరిగిన దృశ్యం(ఫైల్)

హామీకే పరిమితమైన పరిహారం

జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరదలు, ఈ వానాకాలం సీజన్‌లో విధ్వంసం సృష్టించాయి. సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యటించి వరద తీవ్రతను, నష్టం వివరాలను స్వయంగా తెలుసుకుని ఆదుకుంటామన్నారు. అయితే ఇప్పటికీ ఎలాంటి నష్టపరిహారం అందలేదు. వరదల వల్ల సుమారు 24 వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. వరి, మొక్కజొన్న, సోయాబీన్ కోతలు పూర్తి కావస్తున్నాయి. ప్రస్తుత తరుణంలో కూడా పంట దిగుబడులు రాక రైతులు నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్న రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాల్సి ఉంది. కానీ నెలలు గడుస్తున్నా పంటలకు పరిహారం ఇవ్వకపోవడం రైతులను అసహనానికి గురి చేస్తోంది. వరదల సమయంలో దెబ్బతిన్న పంటలకు ఎకరాన రూ.10వేలు నష్టపరిహారం అందిస్తామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే ప్రభుత్వ సాయం అందకపోవడంతో రైతులు మండిపడుతున్నారు.

రూ.25.97 కోట్లు నష్టపరిహారం అవసరం

వరదల వల్ల జిల్లా రైతులు కుదేలయ్యారు. వేల ఎకరాల్లోనే పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో రైతన్నలను కొలుకోలేని దెబ్బ తీసింది. వరద నీటిలోనే రోజుల తరబడి పంట నీట మునిగిపోవడంతో మురిగిపోయి కుళ్లిపోయింది. మరికొన్నిచోట్ల వరద ఉధృతికి కొట్టుకుపోయింది. కొన్ని పంట పొలాల్లోకి భారీగా ఇసుకమేటలు వెలిశాయి. దీంతో ఈ పంటలు దేనికి పనికిరాకుండా పోయినట్లు అధికారులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 24,473 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. అయితే ప్రభుత్వం ఎకరాన రూ.10 వేల నష్టపరిహారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ లెక్కన జిల్లాకు బాధిత రైతులకు పరిహారం చెల్లించేందుకు రూ.25.97 కోట్లు నష్టపరిహారం నిధులు కావాల్సి ఉంటుందని సంబంధితశాఖ అధికారులు చెబుతున్నారు.

మండలాలు, గ్రామాల వారీగా పంట నష్టం వివరాలు

మండలం	గ్రామాలు	రైతులు	ఎకరాలు
బాన్సువాడ	8	217	200
బీర్కూర్	7	132	134
నస్రూల్లాబాద్	11	118	94
బిచ్కుంద	24	2062	2551
నిజాంసాగర్	12	649	820
పిట్లం	17	514	521
జుక్కల్	26	1241	1514
పెద్దకొడప్‌గల్	5	135	90
మద్నూర్	16	1456	2023
డోంగ్లీ	10	1652	1738
మహ్మద్‌నగర్	16	374	394
కామారెడ్డి	24	1515	1252
మాచారెడ్డి	11	205	257
పాల్వంచ	12	831	886
రాజంపేట	12	2101	1581
దోమకొండ	14	669	753
బీబీపేట	11	684	788
భిక్కనూరు	18	1326	1254
ఎల్లారెడ్డి	19	1384	694
గాంధారి	38	1085	1033
లింగంపేట	25	1336	1009
నాగిరెడ్డిపేట	29	2389	2665
రామారెడ్డి	11	576	446
సదాశివనగర్	20	518	316
తాడ్వాయి	23	1640	1416

ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

వానాకాలంలో భారీ వర్షాలు, వరదలతో జిల్లాలో జరిగిన పంట నష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే చేయగా 24వేల 473 ఎకరాలలో పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించాం. ఈ నివేదికను ఇది వరకే ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం పరిహారం ఎప్పుడూ ఇస్తారు. ఎంత ఇస్తారనేది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

- మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాశాఖాధికారి

మెకానిక్ వృత్తి దైనందిన జీవితంలో కీలకం

సుభాష్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మెకానిక్ వృత్తి సామాన్య ప్రజల దైనందిన జీవనంలో ఎంతో కీలకమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. నగరంలోని లక్ష్మిగణపతి రోడ్‌లోని మెకానిక్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెకానిక్‌లకు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన హెల్త్‌క్యాంప్‌లు, జీవితబీమా, ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన చికిత్స అందిం చేలా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామ న్నారు. అర్హులైన మెకానిక్‌లకు ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేసేలా చూస్తానన్నారు. దేశ అభివృద్ధి పథంలో ప్రతి వృత్తి, వర్గం భాగస్వామ్యం కావాలని ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. కొత్తగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, లీగల్ అడ్వైజర్ రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర మెకానిక్ అధ్యక్షుడు బాబు, వైస్ ప్రెసిడెంట్ మురళి, రాష్ట్ర ప్రచార సెక్రెటరీ శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు రతన్, బాబ, గంగారాం, రామచంద్ర, గంగాధర్, పవన్ ముందాడ, సతీష్,భాస్కర్ ఉన్నారు.

(5వ పేజీ తరువాయి)

పల్లెల్లో వేడెక్కిన రాజకీయం

ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామీణ ఓట్లు కీలకం కానుండడంతో తమ పార్టీ మద్దతుదారులు సర్పంచ్, వార్డు స్థానాలను కైవసం చేసుకునేలా వ్యూహాలు రచిస్తున్నారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు స్థానికంగానే మకాం వేసి గెలుపు గుర్రాలను ఎంపిక చేసుకుని వారికి మద్దతుగా ప్రచారం నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు మదన్‌మోహన్ రావు, లక్ష్మీకాంతారావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్‌షిండే, సురేందర్‌లు స్థానికంగానే ఉంటూ ఆయా పార్టీ నేతల అనుచరులతో, కార్యకర్తలతో విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. మొదటి దశ నామినేషన్‌లు ముగియడంతో ఆయా గ్రామాల్లో తమ మద్దతుదారులకు పోటీగా ఉన్న వారితో చర్చలు జరుపుతూ బుజ్జగింపు చర్యలు చేపడుతున్నారు. నామినేషన్‌లు పూర్తయినందున ప్రజా మద్దతు ఉన్న వారిని గుర్తించి వారికి మద్దతు ఇచ్చేలా ఆయా గ్రామాల్లోని పార్టీనాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తున్నారు.

(5వ పేజీ తరువాయి)

అవగాహన లేకుంటే అనర్థమే

వ్యక్తి నెల రోజుల పాటుగా తగ్గకుండా జ్వరం వచ్చిన లేదా బరువు తగ్గిపోవడం, ఎక్కువ రోజులు విరోచనాలు అవడం అదే పనిగా దగ్గు రావడం మందులు వేసుకున్నా తగ్గకపోవడం, ఎప్పుడు ఇన్ఫెక్షన్ రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్తంలోని తెల్ల రక్త కణాల్లో సీడీ-4 సంఖ్యను బట్టి హెచ్‌ఐవీ ఎయిడ్స్‌ను గుర్తిస్తారు. ఒక మిల్లీ లీటరు రక్తంలో సీడీ-4 కణాల సంఖ్య 500 లేదా అంతకంటే తక్కువ ఉంటే హెచ్‌ఐవీ సోకి రోగనిరోధక వ్యవస్థ దెబ్బతిన్నట్లు గుర్తిస్తారు.

రోగ నిరోధక వ్యవస్థపై దాడి

మానవ శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థలో సీడీ-4 కణాలు ఎంతో కీలకమైనవి. హెచ్‌ఐవీ పాజిటివ్ బాధితుల్లో వైరస్ సీడీ-4 కణాలపై దాడి చేస్తోంది. ఫలితంగా రోగనిరోధక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. ఆ వైరస్ ప్రభావంను తగ్గించేందుకు ప్రతీనెల అందించే మందులను క్రమం తప్పకుండా వాడాలి.

ముఖ్యంగా స్త్రీలు గర్భం దాల్చినప్పుడు తమ పిల్లలకు ఆ వ్యాధి సోకకుండా వైద్యుల సూచనలు పాటించాలి. గతంలో హెచ్‌ఐవీ సోకిన వారిని సమాజం దూరంగా ఉంచేది. ప్రస్తుతం హెచ్‌ఐవీపై అవగాహన పెరగడంతో ధైర్యంగా ముందుకు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు.

ఫలితంగా మధుమేహం, హైపర్‌టెన్షన్ వ్యాధుల లాగానే ఎయిడ్స్ హెచ్‌ఐవిని నియంత్రించి దీర్ఘకాలికంగా జీవితాన్ని పెంచే వ్యాధిగా గుర్తిస్తున్నారు. గత ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు జిల్లాలో 31,704 మందికి పరీక్షలు చేయగా 184 మందికి హెచ్‌ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ బృందం అవగాహన కార్యక్రమాలు పెంచడంతో జిల్లా వ్యాప్తంగా 19 సంవత్సరాలుగా హెచ్‌ఐవీ కేసులు 5.25 శాతం నుంచి 0.41 శాతంకు తగ్గుముఖం పట్టింది. అదేవిధంగా హెచ్‌ఐవీ సోకిన గర్భిణులను 5 గురిని గుర్తించి వారికి మందులు అందించారు. హెచ్‌ఐవీ సోకిన తల్లి నుంచి పుట్టిన 15 మంది చిన్నారులకు హెచ్‌ఐవీ రాకుండా చర్యలు చేపట్టారు.

కామారెడ్డి ఏఆర్‌టీ సెంటర్ 2,570, బాన్సువాడ ఏఆర్‌టీ సెంటర్‌ల పరిధిలో 1,411 బాధితులు మందులు వాడుతున్నారు. ఇటీవల ఎల్లారెడ్డి, మద్నూర్‌లోనూ మందులను అందిస్తున్నారు. 1,867 ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుంచి పింఛన్‌లు అందిస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

గుడితండా గ్రామపంచాయతీ ఏకగ్రీవం


సమావేశమైన గుడితండాగ్రామస్తులు

రాజంపేట,నవంబరు 30(ఆంధ్రజ్యోతి):రాజంపేట మండలంలోని గుడితండా గ్రామపంచాయతీ ఏకగ్రీవం కానుంది. ఆదివారం గ్రామస్తులంతా కలిసి చర్చించుకుని గ్రామ పంచాయతీని ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. మొదటి విడుతలో ఈ గ్రామంనుంచి సర్పంచ్ స్థానానికి 5 నామినేషన్‌లు రాగా రామవత్ మెని దేవిసింగ్ అనే మహిళను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు.మిగిలిన వారు నామినేషన్‌లు విత్‌డ్రా చేసుకుంటామని పేర్కొన్నారు. అదేవిధంగా నూతన పాలకవర్గసభ్యులను సైతం ఏర్పాటుచేసుకున్నారు. ఉపసర్పంచ్‌గా కెలోత్ రెడ్యాను, వార్డు సభ్యులుగా మాలోత్ దేవిసింగ్,కెతావత్ వనిత, రామవత్ యశోద,గుగులోత్ అన్ను,నేనావత్ దేవిదాస్,రామవత్‌బాబు సింగ్, బానోత్ తెప్లిలతో కూడిన పాలకవర్గాన్ని ఏర్పాటుచేశారు. ఇక ప్రమాణస్వీకారమే ఆలస్యం కానుంది.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70 - ఆంధ్రా కింగ్ తాలూకా
ప్రియ 35 - రాజు వెడ్స్ రాంబాయి
దర్శన్ - జటాదర

బాన్సువాడ

మహేశ్వరి - రాజువెడ్స్ రాంబాయి
వెంకటేశ్వర - ఆంధ్రా కింగ్ తాలూకా

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230

సర్పంచ్, 66 వార్డులు ఏకగ్రీవం

సదాశివనగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలంలో 22గ్రామపంచాయతీలకు గాను తుక్కోజివాడి గ్రామ సర్పంచ్‌గా ఒకే ఒక్కరు నామినేషన్ వేయడంతో ఏకగ్రీవం అయ్యింది. మండలంలో 214వార్డు స్థానాలకు గాను 467 నామినేషన్లు ధాఖలు కాగా 66వార్డు స్థానాలకు కేవలం ఒక్కోక్కటి నామినేషన్ రావడంతో 66వార్డు స్థానాలను అధికారులు ఏకగ్రీవంగా ప్రకటించారు. అడ్లూర్ ఎల్లారెడ్డి 8వ వార్డు, దగ్గి గ్రామంలో 5వ వార్డు, ధర్మారావుపేట్‌లో 4వ, 10వ వార్డు, కల్వరాల్‌లో 2వ, 7వ, 8వ వార్డులు, మర్కల్‌లో 2వ వార్డు, పద్మాజీవాడిలో 2వ, 3వ, 9వ వార్డులు, పూర్యానాయక్ తాండాలో అన్ని వార్డులు, తిమ్మాజీవాడీలో 4వ, 5వ, 6వ వార్డులు, తిర్మన్‌పల్లిలో 4వ, 6వ వార్డులు, యాచారంలో 8వ వార్డు ఒకటి మినహా అన్ని వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఆదివారం నామినేషన్ల ఉపసంహరణ తేది వరకు మరిన్ని సర్పంచ్, వార్డుస్థానాలు ఏకగ్రీవం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న మీసేవా సభ్యులు

మీ సేవ ఆపరేటర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సితారే క్షవిన్

సుభాష్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సితారే క్షవిన్ ఎన్నికయ్యారు. జిల్లాకేంద్రంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ప్రముఖ న్యాయవాది శ్యాంకుమార్, రిటైర్డ్ ప్రభుత్వ ప్రిన్సిపాల్ కాలేవర్ రవి ఆధ్వర్యంలో ఈ నెల 26న ఎన్నికల నోటిఫికేషన్ నామినేషన్‌లు స్వీకరించారు. నామినేషన్‌ల ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచిన అభ్యర్థులకు ఎన్నికలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 240 మీసేవా నిర్వహకుల్లో 151 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల కమిటీ నిర్వాహకులు గూడురి శేఖర్, మహ్మద్ షాహిద్, ప్రభుదాస్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన వారితో రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

- రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి

మోపాల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కార్యకర్తలకు సూచించారు. మండలంలోని ఎల్లమ్మకుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సంజీవ్, రమేష్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్‌కి చెందిన నాయకులు మాజీ ఎంపీపీ యాదగిరి ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. బడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.